

5 లోపు ఓటరు స్లిప్పులు పంపిణీ పూర్తి చేయాలి

అనంతపురం సిటీ : పట్టభద్రుల, ఉపాధ్యాయుల నియోజకవర్గ శాసనమండలి ఓటర్లకు ఈనెల 5వ తేదీలోపు ఓటర్ స్లిప్పుల పంపిణీ పూర్తిచేయాలని రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. గురువారం ఉదయం అనంతపురం రాజేంద్ర నగర పాలక ఉన్నత పాఠశాల, రాప్తాడు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను అనంతపురం ఆర్‌డిఒ మధుసూదన్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, పోలింగ్ సిబ్బందికి వసతి సౌకర్యాలు కూడా సక్రమంగా ఉండేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ఆయా కేంద్రాల్లో పట్టభద్రుల, ఉపాధ్యాయుల నియోజకవర్గ శాసనమండలి ఓటర్లకు పంపిణీ చేస్తున్న ఓటర్ స్లిప్పుల ప్రక్రియను పరిశీలించి, ఈనెల 5వ తేదీలోపు ఓటర్ స్లిప్పులను పంపిణీ పూర్తి చేయాలని ఆదేశించారు.

మాట వింటే సరి..లేకపోతే కట్టడే..

ఇద్దరు ఉపాధ్యాయ నేతలకు షోకాజ్ నోటీసులు

నియోజకవర్గాల వారీగా సమావేశాలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అధికార పార్టీకి అనుకూలంగా ఉంటే సరి.. లేకపోతే.. శాఖాపరమైన హెచ్చరికలు తప్పేలా కనిపించడం లేదు. మండలి ఎన్నికల్లో ప్రభావితం చూపే వారిపై అధికారపార్టీ దృష్టి సారిస్తోంది. ఏ చిన్న వంక దొరికినా అధికారిక హెచ్చరికలు తప్పడం లేదు. ఇటీవల జరిగిన ఉపాధ్యాయ మండలి ఎన్నికల నామినేషన్ల కార్యక్రమంలో తమ సంఘం బలపరిచిన వ్యక్తి ప్రదర్శనలో పాల్గొన్నారని ఆ సంఘం ఉపాధ్యాయ నేతకు షోకాజ్ నోటీసులు అందాయి. ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికలు కావడంతో మద్దతుగా ఓటరు కూడా ఆయిన వారు పాల్గొనే వీలుంటుంది. కాని అంతకు మునుపు అధికార పార్టీ ప్రజాప్రతినిధి ఒకరు ఆయన అధికారపార్టీ బలపరిచిన వ్యక్తికి మద్దతునివ్వాలని కోరినట్టు సమాచారం. ఆయన అంగీకరించలేదు. దీన్ని మనుసులో పెట్టుకునే ఈ రకమైన చర్యలకు ఉపక్రమించారన్న విమర్శలూ వ్యక్తమవుతున్నాయి. సత్యసాయి జిల్లాలోనూ ఇదే రకంగా మరో నాయకుడికి షోకాజ్ నోటీసులు అందాయి. మరికొంత మందిపైనా దృష్టి సారించినట్టు తెలుస్తోంది. మండలి ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి ఇదే రకమైన తంతు నడుస్తోంది. ప్రధానంగా ఉపాధ్యాయ నియోజకవర్గాలకు సంబంధించి ప్రయివేటు స్కూళ్లలో అర్హత లేని వారిని కూడా ఓటర్లుగా చేర్చే అంశంలో మాట వినలేదన్న ఉద్దేశంతో అప్పటి జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్‌ను బదిలీ చేశారు. అటు తరువాత రీజినల్ జాయింట్ డైరెక్టరును ఇన్‌ఛార్జిగా పెట్టారు. తిరిగి ఆయన్ను బదిలీ చేసి తమకు అనుకూలంగా వ్యవహరించే జాయింట్ డైరెక్టరు ప్రతాప్‌రెడ్డిని ఆర్జేడీగా నియమించారు. జిల్లా విద్యాశాఖ అధికారి సాయిరాంను వేశారు. ఈ ఆర్జేడీ ఇటీవల అనంతపురం నగరానికి విచ్చేసి అధికార పార్టీ అభ్యర్థిని వెంటబెట్టుకుని నాయకులను ప్రలోభపెట్టే ప్రయత్నం చేయడం, దాన్ని విద్యార్థి, యువజన సంఘాలు అడ్డుకోవడం వివాదం రేపింది. ఈయన తీరుపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఎన్నికల సంఘం ఆ ఫిర్యాదుపై స్పందించి విచారణ చేపట్టింది. ఎన్నికలు అయిపోయే వరకు ఆయన ఈ ప్రాంతాల్లో పర్యటించడానికి వీల్లేకుండా ఆదేశాలు జారీ చేసింది. ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా చేసుకున్న అధికారపార్టీ అభ్యర్థులను గెలిపించే బాధ్యతలను ఎమ్మెల్యేలకు అప్పగించారు. ఎమ్మెల్యేలు అన్ని నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ సమావేశాల్లో ఓటర్లను ప్రలోభ పెట్టడంపైనా దృష్టి సారిస్తున్నారు. ఓటర్లను ప్రభావితం చేయగలిగే స్థానిక నేతలను గుర్తించి వారిని తమ దారికి తెచ్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అధికారపార్టీ నేతలు మాత్రం ఎన్నికల నిబంధనలను సైతం పాటించకుండా నేరుగా ప్రచారాలు చేస్తున్నారు. పాఠశాల సమయాల్లో ప్రచారాలు చేయడానికి వీల్లేదని చెబుతున్నా మంత్రి ఉష శ్రీచరణ్ నేరుగా కంబదూరు మండలంలో ప్రచారం చేయడం విమర్శలకు తావిస్తోంది. ప్రజాప్రతినిధులే ఈ రకంగా వ్యవహరిస్తుండటంతో అధికారులు సైతం మిన్నకుండిపోతున్నారు. ఎన్నికల సమయం సమీపిస్తున్న కొద్దీ ఇటువంటి చర్యలు పెరుగుతున్నాయని ఇతర అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నికల సంఘం పర్యవేక్షించి అక్రమాలను అరికట్టాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

అనంతపురం కలెక్టరేట్ : ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచేందుకు అధికార పార్టీ నాయకులు, కొందరు అధికారులు సిద్ధమయ్యారని సిపిఎం జిల్లా కమిటీ విమర్శించింది. శుక్రవారం ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ పాత్రికేయులతో మాట్లాడారు. జిల్లా మంత్రి మొదలు విద్యాశాఖ అధికారుల వరకు బహిరంగంగా ఎన్నికల నిబంధనలను ధిక్కరిస్తున్నారని విమర్శించారు. ఉద్యోగులను ప్రభావితం చేసేందుకు అధికారుల ద్వారా సమావేశాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. జిల్లాలో అనేక ప్రాంతాల్లో సచివాలయ ఉద్యోగులతో సమావేశం జరిపారని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్‌పై ఉపాధ్యాయుల, ఉద్యోగులకు అవగాహన కల్పించే పేరుతో సమావేశాలు జరిపి వారిని ప్రలోభాలకు, బెదిరింపులకు గురి చేస్తున్నారని అన్నారు. జిల్లా మంత్రి ఉషశ్రీ చరణ్ కంబదూరు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రచారం చేశారని తెలిపారు. పాఠశాల సమయంలో ప్రచారం చేయరాదని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చి ప్రతిపక్షాల ప్రచారాన్ని అడ్డుకుంటూ, మరో వైపు అధికార పార్టీ నేతలను యథేచ్ఛగా అనుమతించడం పట్ల ఎన్నికల కమిషన్ మౌనంగా ఉందని విమర్శించారు. ఎన్నికలు జరిగే లోపు అనేక అక్రమ పద్ధతులకు అధికార పార్టీ పాల్పడుతుందన్నారు. తక్షణమే ఎన్నికల సంఘం జోక్యం చేసుకుని అక్రమాలు అరికట్టందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.


ఒత్తిడి పెట్టారు..ఇల్లు కట్టించారు..!

ఆ పార్టీ.. ఈ పార్టీ అని కాదు.. ఏ పార్టీ అయినా ఎన్నికల సమయంలో సొంతి ఇల్లు లేని వారందరికీ ఇంటి స్థలంతో పాటు ఇల్లు నిర్మించి ఇస్తామని హామీలపై హామీలు ఇస్తారు. అధికారంలోకి వచ్చాక దాని గురించి మరిచిపోవడం పరిపాటిగా మారింది. ప్రభుత్వానికి తగ్గట్లు అధికారులు సైతం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో ఇళ్ల నిర్మాణల కోసం చేసిన అప్పలకు లబ్ధిదారులు వడ్డీలు చెల్లించాల్సి వస్తోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో పరిస్థితి ఇది.

అధికారుల నిర్లక్ష్యం..

మంజూరు కాని బిల్లులు

వడ్డీలు కడుతున్న లబ్ధిదారులు



చౌళూరు గ్రామంలో బిల్లులు మంజూరుకాని జగనన్న ఇల్లు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం చౌళూరు గ్రామంలో సొంతిల్లు లేని కెఎస్. లతకు డిసెంబర్ 2వ తేది 2020 సంవత్సరంలో గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో ఇల్లు మంజూరు చేశారు. ఇంటి నిర్మాణాన్ని బట్టి బిల్లులు మంజూరు చేస్తామన్నారు. వారి వద్ద డబ్బులు లేక పోవడంతో ఇంటి నిర్మాణం వెంటనే చేపట్టలేదు. దీంతో గ్రామ స్థాయిలో ఉన్న ఇంజినీరింగ్ అసిస్టెంట్ పనులు పూర్తి అయిన వెంటనే బిల్లులు మంజూరు చేయిస్తామని, అధైర్య పడకుండా వెంటనే పనులు ప్రారంభించాలని వారికి భరోసా కల్పించారు. అధికారి మాటలు నమ్మిన లత, భర్త శ్రీనివాసరెడ్డిలు అప్పుచేసి వారు నివాసముంటున్న గుడిసె స్థలంలో పూనాది వేశారు. దానికి సంబంధించిన బిల్లు కోసం సచివాలయం, గృహ నిర్మాణ శాఖ కార్యలయం చుట్టూ తిరిగారు. వారు అక్కడికి వచ్చి జియో ట్యాగ్ చేసి గోడలు కట్టాలని, పునాదికి సంబంధించి బిల్లు మరో 10 రోజుల్లో మంజూరు అవుతుందని చెప్పారు. దీనిని నమ్మిన వారు మరో చోట అప్పు చేసి గోడల నిర్మాణం చేపట్టారు. మళ్లీ బిల్లు కోసం అధికారుల వద్దకు వెళ్లారు. అధికారులు వచ్చి జియో ట్యాగ్ చేసి రెండు బిల్లులూ మంజూరు అవుతాయని చెప్పి వెళ్లి పోయారు. సంవత్సరాలు గడుస్తున్నా వారికి రావాల్సిన బిల్లులు మాత్రం ఇప్పటికీ మంజూరు కాలేదు. నాటి నుంచి నేటి వరకు గ్రామ సచివాలయం నుంచి కలెక్టర్ కార్యలయం వరకు బిల్లులు మంజూరు చేయాలని అధికారులకు వినతులు ఇచ్చి మరీ కోరుతున్నారు. ఇదే విధంగానే అనంతపురం ఉమ్మడి జిల్లాలోని పలు గ్రామాల్లో అప్పులు చేసి ఇళ్ల నిర్మాణం చేసుకుని బిల్లుల కోసం ఎదురు చూస్తున్నారు. చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించలేక పోతున్నామని ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులు వాపోతున్నారు.

అధికారుల మధ్య సమన్వయ లోపం..

గ్రామ స్థాయిలో ఇంజినీరింగ్, గృహ నిర్మాణ శాఖ అధికారుల మధ్య ఉన్న సమన్వయం లోపం వల్ల ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు. క్షేత్ర స్థాయిలో ఎంపిక చేసిన లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సిన భాధ్యత ఇంజినీరింగ్ అసిస్టెంట్‌పై ఉంది. అయితే ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి గృహ నిర్మాణ శాఖ అధికారులు చేసుకుంటారని వారు పట్టించుకోవడం లేదు. ఇలా ఎవరికి వారే.. యమునా తీరే.. అన్న చందంగా నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు.

బిల్లుల కోసం ఏడాదిగా తిరుగుతున్నాం..



ప్రభుత్వం తమకు 2020లో ఇళ్లు మంజూరు చేసింది. వెంటనే ఇల్లు కట్టుకోడానికి తమ వద్ద డబ్బులు లేక పోవడంతో నిర్మాణం చేపట్టలేదు. గ్రామంలో సచివాలయంలో పనిచేసే అధికారికి తమ వద్దకు వచ్చి బిల్లులు మంజూరు అవుతాయని, తాము దగ్గరుండి మంజూరు చేయిస్తామని ధైర్యం చెప్పారు. ఇంట్లో ఉన్న బంగారాన్ని తాకట్టు పెట్టడంతో పాటు అప్పులు చేసి ఇంటి నిర్మాణం చేపట్టాం. గోడల వరకు ఇంటి నిర్మాణం పూర్తి చేశాం. దానికి సంబంధించి బిల్లులు ఇప్పటికీ మంజూరు కాలేదు. దీంతో సచివాలయంలో ఫిర్యాదు చేశాం. గృహ నిర్మాణ శాఖ కార్యాలయం, జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని అధికారులకు న్యాయం చేయాలని పలుమార్లు విన్నవించుకున్నాం. చివరకు ఆధార్ నెంబరు మిస్ మ్యాచ్ అయిందని అంటున్నారు. ఇంటి నిర్మాణం కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియడం లేదు

- కెఎస్.లత, లబ్ధిదారు, చౌళూరు గ్రామం

ఇప్పటికే రెండు బిల్లులు మంజూరయ్యాయి

హిందూపురం రూరల్ మండలం చౌళూరు గ్రామంలో లబ్ధిదారులు లత నిర్మాణం చేసిన ఇంటి నిర్మాణానికి సంబంధించి రెండు బిల్లులు మంజూరు చేశాం. 2021 ఆగస్టు 12వ తేది పునాదికి సంబంధించి రూ.44.200, గత ఏడాది జూన్ 28న గోడలకు సంబంధించి రూ.63,200 మంజూరు చేశాం. అయితే ఆ డబ్బులు లత ఖాతాకు చేరలేదు. పరిశీలన చేసి వెంటనే వారి ఖాతాకు జమ అయ్యే విధంగా చర్యలు చేపడతాం.

- శివకుమార్ నాయక్, హౌసింగ్ డీఈఈ

ఆర్‌ఒబి వద్ద గడ్డర్ల లాంచింగ్ షురూ..

పనులు పరిశీలించిన ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

తొలి రోజు ఐదు స్టీల్ గడ్డర్లు అమరిక

మే తొలి వారంలో పనులు పూర్తి

ప్రజాశక్తి -అనంతపురం

అనంతపురం టవర్‌క్లాక్ సమీపంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జి పనుల్లో కీలకమైన గడ్డర్ల ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైంది. రైల్వే అధికారుల నుంచి అనుమతులు రావడంతో శుక్రవారం మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 3.30 గంటల వరకు స్టీల్ గడ్డర్లను ఏర్పాటు చేశారు. తొలి రోజు ఐదు గడ్డర్లను అమర్చగా శనివారం కూడా మరో ఐదు గడ్డర్లను అమర్చనున్నారు. ఈ పనులను అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పర్యవేక్షించారు. రైల్వే అధికారులు రమేష్, రవిబాబు, రమణయ్య, ఎన్‌హెచ్ అధికారులు గుప్తా, ధనలక్ష్మి, ఎస్‌ఆర్‌సి ప్రతినిధులు అవినాష్, హర్షతో ఎమ్మెల్యే మాట్లాడారు. ఐదు స్టీల్ గడ్డర్లను ఏర్పాటు చేసే వరకు అక్కడే ఉండి పర్యవేక్షణ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనంత మాట్లాడుతూ.. అర్బన్ లింక్ వైడనింగ్ ప్రాజెక్ట్ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. ఆర్‌ఒబి వద్ద కీలకమైన గడ్డర్ల లాంచింగ్ ప్రారంభమైందన్నారు. నగరంలో జాతీయ రహదారి విస్తరణ పనులు దాదాపు పూర్తయ్యే దశకు చేరుకున్నాయని చెప్పారు. రైల్వే, ఎన్‌హెచ్ అధికారులు, నగర పాలక సంస్థ పాలకవర్గం, అధికార యంత్రాంగంతో పాటు ఎస్‌ఆర్‌సి ఏజెన్సీ ప్రతినిధుల కృషి వల్ల పనులు ఇంత త్వరగా జరుగుతున్నాయని తెలిపారు. ఎక్కడా లేని విధంగా 9.1 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి విస్తరణ పనులు చేపట్టినట్లు చెప్పారు. ఏప్రిల్ నెలాఖరు లేదా మే మొదటి వారం నాటికి ఆర్‌ఒబి పనులు పూర్తవుతాయన్నారు. ఆ తర్వాత బ్రిడ్జిపై రాకపోకలకు అనుమతి ఇస్తామని తెలిపారు. జూన్ నాటికి అండర్ పాస్ పనులు కూడా పూర్తవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. గడ్డర్ల లాంచింగ్ విషయంలో రైల్వే అధికారుల సహకారం ఎంతో ఉందని, వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. 55 ఏళ్ల క్రితం అప్పటి అవసరాలకు అనుగుణంగా బ్రిడ్జి నిర్మాణం జరిగిందన్నారు. కానీ ఇప్పుడు జనాభా పెరిగిపోయిందన్నారు. సుమారు 5 లక్షల జనాభా అనంతపురంలో ఉందన్నారు. కనెక్టివిటీ పెరగడంతో వాహన రాకపోకలు ఎక్కువగా సాగుతున్నాయని చెప్పారు. అందుకోసమే డబుల్ బ్రిడ్జిని ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. బ్రిడ్జి పనులు పూర్తికాగానే రాకపోకలకు అనుమతి ఇస్తామన్నారు. ప్రజల సహకారం కూడా ఉండడంతోనే పనులు అనుకున్న సమయం కంటే ముందుగానే పూర్తవుతున్నాయని చెప్పారు. ఎమ్మెల్యే అనంత వెంట మేయర్ మహమ్మద్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, పలువురు కార్పొరేటర్లు, వైసీపీ నాయకులు ఉన్నారు.



పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనంత, మేయర్ వసీం తదితరులు

కార్పొరేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

ఆర్ఐఒకు ఎస్ఎఫ్ఐ నాయకుల వినతి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ పరీక్షల్లో మంచి మార్కులు వేస్తామంటూ డబ్బులు వసూలు చేస్తున్న ప్రయివేట్, కార్పొరేట్ కళాశాలల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆర్ఐఒ సురేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పరమేష్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ జరుగుతున్న నేపథ్యంలో ప్రయివేట్, కార్పొరేట్ కళాశాలలు విద్యార్థుల నుంచి వేల రూపాయలు వసూలు చేయడానికి శ్రీకారం చుట్టాయని తెలిపారు. ఇప్పటికే అనంతపురం జిల్లా వ్యాప్తంగా కార్పొరేట్ కళాశాలల్లో విద్యార్థులతో ప్రాక్టికల్స్ మార్కుల కోసం, రికార్డుల కోసం వేల రూపాయలు వసూలు చేసుకున్నారని విమర్శించారు. సమస్యపై విద్యార్థుల తల్లిదండ్రులే అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా చలనం లేకుండా వ్యవహరించడం సరికాదన్నారు. కళాశాలకు ఫీజులు చెల్లించలేదనే నెపంతో ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. పిఆర్‌కె కళాశాల యాజమాన్యం కళాశాలలో సెకండ్ ఇయర్ చదువుతున్న కీర్తి అనే విద్యార్థిని ఫీజుల కోసం మానసికంగా ఒత్తిడికి గురి చేశారని తెలిపారు. పరిశీలించి పిఆర్‌కె కళాశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో జిల్లాలో అన్ని ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు. స్పందించిన ఆర్ఐఒ అలాంటి కళాశాలలపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు మణిదీప్, రాజేష్, రజిత, శివమ్మ, అరుణ, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు వ్యవస్థలో హోంగార్డులు అంతర్భాగమే

మొబిలైజేషన్ ముగింపు సమావేశంలో ఎస్‌పి రాహుల్‌దేవ్ సింగ్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

హోంగార్డులు పోలీసు వ్యవస్థలో అంతర్భాగమేనని, పోలీసులతోపాటు విధి నిర్వహణ ఉంటుంది కాబట్టి నైపుణ్యత మెరుగుపరచుకోవాలని శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ పేర్కొన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తిలోని పోలీస్ పరేడ్ మైదానంలో 15 రోజులుగా జరుగుతున్న, హోంగార్డ్స్ మొబిలైజేషన్ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. హోంగార్డ్స్ కూడా పోలీస్ వ్యవస్థలో అంతర్భాగమే అన్నారు. నిరంతరం పోలీస్ సిబ్బందితో సమానంగా విధులు నిర్వర్తిస్తున్నారన్నారు. ఈ తరుణంలో ఈ మొబిలైజేషన్ కార్యక్రమం విధుల్లో నైపుణ్యాలను మెరుగుపరచుకోవడానికి ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గత 15 రోజులుగా హోంగార్డులకు లాఠీ డ్రిల్, ప్రాథమిక ఆయుధాలపై అవగహన, ప్రముఖల మాబ్ కంట్రోల్, మానసిక ప్రశాంతత కోసం యోగా మొదలైన వాటిపై శిక్షణ ఇచ్చామన్నారు. పోలీస్ శాఖ లోనే కాకుండా ఫైర్, జైళ్లశాఖ, రవాణా శాఖ పరిధిలో జిల్లాలో మొత్తం 304 మంది హోంగార్డ్స్ విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం కూడా హోంగార్డుల సంక్షేమానికి ఎల్లవేళలా కట్టుబడి ఉందన్నారు. అందులో భాగంగానే పోలీస్ శాఖలోని కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్‌లో గతంలో ఉన్న హోంగార్డు కోటాని 25 శాతానికి పెంచామని చెప్పారు. దీని ద్వారా హోంగార్డులు ఎక్కువ మంది పోలీస్ శాఖలకు రావడానికి అవకాశాలు మెరుగయ్యాయన్నారు. ఈ అవకాశాన్ని అర్హత ఉన్న ప్రతీ హోంగార్డు వినియోగించుకొని పోలీస్ శాఖలోకి రావాలని తెలియజేశారు. శ్రీ సత్యసాయి జిల్లా ఏర్పడిన అనంతరం విధులు నిర్వహిస్తూ మరణించిన ఇద్దరు హోంగార్డుల కుటుంబ సభ్యులను హోంగార్డులుగా నియమించామని చెప్పారు. వారికి రావాల్సిన ఆర్థిక సహాయాన్ని కూడా వారి కుటుంబ సభ్యులకి పోలీస్ శాఖ తరపున అందజేశామని తెలిపారు. సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ, చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ, ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ పోలీస్ శాఖకి, వారి కుటుంబ సభ్యులకు మంచి పేరు తీసుకురావాలని తెలియజేశారు. అనంతరం ప్రతిభ కనబరచిన హోంగార్డులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ కెవి.రామకృష్ణ ప్రసాద్, ఎఆర్ డిఎస్‌పి విజయ్‌కుమార్, సిఐలు గంటా సుబ్బారావు, లక్ష్మన్న, ఆర్ఐ లు టైటస్, శ్రీశైలం రెడ్డి, నారాయణ, ఆర్ఎస్ఐలు, ఎ ఆర్ ఎస్ఐ లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎసిపి రాహుల్‌దేవ్‌సింగ్

వైభవంగా శ్రీవారి కల్యాణోత్సవం

పజాశక్తి కదిరి అర్బన్

ఖాద్రీ లక్ష్మి నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా రెండవ రోజు శుక్రవారం శ్రీవారి కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. యాగశాల నుంచి నవ వధువులుగా అలంకరణతో శ్రీదేవి భూదేవి సమేతంగా ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో తీసుకువచ్చారు. కళ్యాణోత్సవానికి ప్రధానంగా ప్రభుత్వం తరపున అందిస్తున్న పట్టు వస్త్రాలను స్థానిక ఎమ్మెల్యే పీవీ సిద్ధారెడ్డి, పార్లమెంటు సభ్యులు గోరంట్ల మాధవ్, దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్, డిసి రాణా ప్రతాప్‌లు స్వామివారికి సమర్పించారు. తిరుమల తిరుపతి నుండి అర్చకులు హాజరై కళ్యాణోత్సవం నిర్వహించారు.కల్యాణోత్సవానికి ఎపి నుంచే కాకుండా కర్నాటక, తమిళనాడు ఇతర రాష్ట్రాల నుండి భారీ ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఆలయ పరిసరాలలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా డిఎస్‌పి భవ్య కిషోర్ ఆధ్వర్యంలో పట్టణ సిఐ తమ్మిశెట్టి మధు తదితరులు బందోబస్తు నిర్వహించారు.



సమన్వయంతో లక్ష్యాన్ని పూర్తి చేయాలి

ప్రజాశక్తి -పెనుకొండ

సమన్వయంతో రైతులకు ఇబ్బంది లేకుండా పనిచేసి లక్ష్యాన్ని పూర్తి చేయాలని జిల్లా ఎపిఎంఐపి ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.సుదర్శన్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని జిల్లా హార్టికల్చర్ కార్యాలయంలో డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింక్లర్ ఇరిగేషన్, ఎంఐ కంపెనీల వారీగా, టార్గెట్స్ అచీవ్మెంట్స్, మండలాలు, కంపెనీల వారిగా రైతుల రిజిస్ట్రేషన్లు తదితర వాటిపై సమీక్ష నిర్వహించారు. అన్ని కంపెనీల ప్రతినిధులు, జిల్లాకు ఇచ్చిన టార్గెట్లను ఆర్థికసంవత్సరం లోపు పూర్తి చేయాలని ఆదేశించారు.

మహిళా దినోత్సవం వారోత్సవాలు

సోమందేపల్లి : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్యబృందం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మహిళా ప్రాధాన్యత, మహిళా హక్కులు, మహిళా చట్టాల గురించి తెలియజేశారు. మహిళలు ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థానంలో ఉండాలని విద్యతోనే అన్ని సాధ్యమవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది వెంకటసుబ్బమ్మ, నారాయణమ్మ, చిట్టెమ్మ , లక్ష్మీదేవి సచివాలయ మహిళా కార్యదర్శులు పాల్గొన్నారు.,

ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా

లేపాక్షి : మండలం పరిధిలోని కల్లూరు గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి అధికారులు శుక్రవారం చర్యలు తీసుకున్నారు. నీటి సమస్యపై సిపిఎం ఆధ్వర్యంలో మహిళలు ఖాళీ బిందెలతో పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించిన నేపథ్యంలో అధికారులు స్పందించారు. ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేశారు.

క్షతగాత్రుడికి పరామర్శ

కొత్తచెరువు : మండల పరిధిలోని పోతులకుంట గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త రామాంజనేయులు ఇటీవల ప్రమాదానికి గురై పుట్టపర్తి లోని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ రామాంజనేయులును శుక్రవారం పరామర్శించారు. మిత్రుల ద్వారా రక్తాన్ని ఆయనకు అందించారు.

పాత్రికేయులపై దాడులను అరికట్టాలి

పెనుకొండ : జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని పెనుకొండ జర్నలిస్టులు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ కె. కార్తీక్ కు వినతి పత్రం సమర్పించారు. కదిరిలో విధి నిర్వహణలో ఉన్న పాత్రికేయులపై సిఐ దాడి చేసి జర్నలిస్టులపైనే అక్రమ కేసులు నమోదు చేయడం దుర్మార్గమన్నారు. వెంటనే సిఐ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు రవూఫ్, ప్రకాష్ గౌడ్, నవీన్ కుమార్, ఆదినారాయణ, మధుమోహన్, చంద్రమౌళి, రామాంజి నేయులు, ప్రసాద్, హరి, మూర్తి, చరణ్, భాషా, బాబా, హరి తదితరులు పాల్గొన్నారు.

ప్రయివేటు పాఠశాలలో 15 మంది విద్యార్థులకు అస్వస్థత

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

మునిసిపాలిటీ పరిధిలోని వాసవి ఇంగ్లీష్ మీడియం ప్రైవేట్ పాఠశాలలో 15 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. శుక్రవారం ఆ పాఠశాలలో పై అంతస్తులో 5వ తరగతి చదువుతున్న 15 మంది విద్యార్థులు ఒక్కసారిగా కడుపు నొప్పితో గగ్గోలు పెట్టారు. కేవలం 5వ తరగతి విద్యార్థులకు మాత్రమే అస్వస్థతకు గురి కావడం పట్ల ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. ఆ అంతస్తులోని గదిలోకి ఏదైనా చెడు వాసన సోకిందా? లేక ఆహారంలో కల్తీ జరిగిందా అన్న విషయాలపై ఆర్డీవో భాగ్యరేఖ, డీఈవో మీనాక్షి ఆరా తీశారు. 15 మందిని హుటాహుటిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఇందులో ఐదుగురి పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో వారిని సత్యసాయి జనరల్ ఆసుపత్రికి తరలించారు. మరో ఆరుగురు చికిత్స అనంతరం కోలుకోవటంతో వారి తల్లిదండ్రులు ఇంటికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా డిఇఒ, మీనాక్షి మాట్లాడుతూ తనతో పాటు ఆర్డీవో భాగ్యరేఖ, పోలీస్ అధికారులు ఆ గదిని పరిశీలించామని ఎలాంటి దుర్వాసన రాలేదని అన్నారు. ఆ విద్యార్థులు పుట్టినరోజు సందర్భంగా ఎవరో పెసర బేడలతో చేసిన పిండి వంటలు తిన్నారని తెలిసిందని బహుశా వాటి నుంచి ఇలా జరిగి ఉండవచ్చని అన్నారు. ఆ పిండి వంట పదార్థాలు ఎవరు ఇచ్చారు, అది విషపూరితంగా మారిందా అన్న కోణంలో పోలీసులు విచారిస్తున్నారన్నారు. ఇప్పటికైతే అందరూ క్షేమంగా ఉన్నారని డిఇఒ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి యశ్వంత్, సిఐలు బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, జయనాయక్ పాల్గొన్నారు.


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

అర్హులకు ప్రభుత్వ పథకాలు అందాలి : సబ్ కలెక్టర్

ప్రజాశక్తి -పెనుకొండ

అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలను అందించేలా చర్యలు తీసుకోవాలని పెనుకొండ సబ్ కలెక్టర్ కె. కార్తీక్ ఆదేశించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం మండలంలోని దుద్దెబండ గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలో రిజిస్టర్లను తనిఖీ చేశారు. అనంతరం సచివాలయం ఉద్యోగులతో సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ శివశంకరప్ప , సచివాలయ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

లింగ వివక్షను అరికట్టాలి

పుట్టపర్తి రూరల్ : లింగ వివక్ష అరికట్టడం, డ్రైడే ఫ్రైడే అంతర్జాతీయ మహిళ దినోత్సవ వారోత్సవాలలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని జగరాజు పల్లి, పెడపల్లి గ్రామాల్లో ప్రజలకు శుక్రవారం అవగాహన కల్పించారు. డాక్టర్ నివేదిత, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ కుల్లాయప్ప నాయక్ తదిరులు విద్యార్థినులకు స్త్రీ శక్తిని, లింగ నిర్ధారణ కేంద్రాలపై చర్యలు, భేటి బచావో– భేటి పడావో గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మురళి, సిహెచ్ఒ నగేష్, సబ్ యూనిట్ అధికారి రమణయ్య, సూపర్ వైజర్లు చంద్రకళ, వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పింఛను కోసం తల్లిని చంపిన తనయుడు

సోమందేపల్లి : పింఛను డబ్బుల కోసం కన్నతల్లినే ఓ కసాయి కొడుకు చంపిన ఘటన సోమందేపల్లి మండలంలో చోటుచేసుకుంది. ఈఘటనకు సంబందించి పోలీసులు తెలిపిన వివరాలు... పందిపర్తి గ్రామానికి చెందిన నరసమ్మ (60)కు పింఛను వస్తోంది. ఆమె కొడుకు శ్రీనివాస్ మద్యంకు బానిసై డబ్బుల కోసం తల్లిని వేధించేవాడు. ప్రతినెల తల్లికి వచ్చే పింఛను డబ్బులు బలవంతంగా తీసుకెళ్లేవాడు. ఈ క్రమంలో నరసమ్మకు గురువారం పింఛను డబ్బులు పంపిణీ చేశారు. ఆ డబ్బులు ఇవ్వాలని శ్రీనివాస్ గురువారం రాత్రి తల్లిని వేధించాడు. ఆమె డబ్బులు ఇవ్వటానికి నిరాకరించడంతో శ్రీనివాస్ నరసమ్మను ఇటుకతో తలపై కొట్టాడు. దీంతో ఆమె మృతిచెందింది. గమనించిన శ్రీనివాస్ పరారయ్యాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ కరుణాకర్ తెలిపారు.

అగ్నిప్రమాదంలో ఇంటి సామగ్రి దగ్ధం

రొద్దం : మండలంలోని తడంగిపల్లిలోని తిమ్మరాజు అనే వ్యక్తి ఇంట్లో ప్రమాదవశాత్తు జరిగిన అగ్నిప్రమాదంలో బీరువాలోని దుస్తులు దగ్ధం అయ్యాయి. గురువారం రాత్రి ఇంటిలో దీపం వెలిగించిన కుటుంబసభ్యులు ఇంటి బయట నిద్రపోయారు. అయితే బీరువా పక్కనే ఉన్న వెలుగుతున్న దీపం కిందికి పడింది. పక్కనే ఉన్న బీరువాకు మంటలు వ్యాపించాయి. దీంతో బీరువాలోని దుస్తులు, అందులోని నగదు దగ్ధమయ్యాయని బాధతుడు వాపోయాడు.

మట్కా బీటరు అరెస్టు

ధర్మవరం టౌన్ : పట్టణంలోని కేశవనగర్ లో మట్కా రాస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్టు వన్‌టౌన్ సిఐ సుబ్రమణ్యం తెలిపారు. కేశనగర్‌లోని పరమేశ్వరి పంక్షన్ హాల్ వెనుక పల్లా వెంకటచలపతి అనే వ్యక్తి మట్కా రాస్తున్నట్టు సమాచారం రావడంతో తమ సిబ్బంది దాడిచేశారన్నారు. ఈసందర్భంగా వెంకటచలపతిని అరెస్టు చేసి అతని వద్ద నుండి రూ.40,150ల నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపరిచినట్లు చెప్పారు.

గంజాయి కేసులో ఇద్దరు..

ధర్మవరం టౌన్ : గంజాయి అమ్ముతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్ తరలించినట్టు టూటౌన్ సిఐ రాజా తెలిపారు. పట్టణంలోని రాజేంద్రనగర్ రైల్వే గేటు వద్ద సురేశ్, బార్గవ్ అనే వ్యక్తులు గంజాయి అమ్ముతున్నట్టు సమాచారం అందడంతో శుక్రవారం తన సిబ్బందితో దాడులు చేసి నిందితులను అరెస్టు చేశామన్నారు. వారి వద్ద నుండి 200 గ్రాములు గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిద్దరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించారన్నారు.

అప్పులబాధతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

అప్పుల బాధతో ఓ వ్యక్తి సూపర్‌వాజ్‌మోల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండలంలో మల్కాపురం గ్రామానికి చెందిన లింగమయ్య శుక్రవారం సూపర్‌వాజ్‌మోల్ తాగా ఆత్మహత్యాయత్నానికి పాల్పడి అపరస్మారకస్థితిలోకి వెళ్లాడు. స్థానికులు గమనించి ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దళిత విద్యార్థి మృతికి కారకులకు శిక్షించాలి

సోమందేపల్లి : చెన్నేకొత్తపల్లి మండలం కోటంపల్లికి చెందిన దళిత విద్యార్థి సాయి కుమారి మృతికి కారకులను వెంటనే శిక్షించాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి హనుమయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వల్ల మహిళలపై అఘాయిత్యాలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయని విమర్శించారు. ప్రధానంగా దళిత మహిళలపై అఘాయిత్యాలు ఎక్కువగా జరుగుతున్నాయని ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని మండల కమిటీ నాయకులు వెంకటేశు, రామాంజనేయులు, రవి, గౌతమి, తదితరులు కోరారు.

In the Court of the Hon'ble Senior Civil Judge: Kadiri
E.P.No.2/2020 in O.S.91/2013
Between:
N.Venkata Ramana ...D.Hr
And
1.Chekka Laxmidevi
2.Mekala Ademma ...J.Drs

Notice

పై దావాలో మేకల ఆదెమ్మ W/o నారాయణ జె.డి.ఆర్ నెం.2 అయిన మీరు 17-03-2023వ తేది పై కోర్టుకు ఉదయం 10.30 గం॥లకు ఖుద్దున గానీ వకీలు ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకోవలయును. అట్లు కాని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.
(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)
ఎ.గంగిరెడ్డి
వాదిపరం వకీలు, కదిరి.

మహారాజశ్రీ గౌ॥ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి:కదిరి
దావా నెం.175/2020
Between:
బోయ ముతక అక్కులప్ప S/o లేట్ బి.వెంకట్రామన్న, వ్యవసాయము R/at శేషయ్యగారిపల్లి గ్రామం, H/O కొండకమర్ల, ఓ.డి.సి. మండలం, శ్రీసత్యసాయి జిల్లా. ...వాది
మరియు
1.బోయ ముతక లక్ష్మీనారాయణ S/o లేట్ బి.వెంకట్రామన్న, వ్యవసాయము R/o D.No.8-37, శేషయ్యగారిపల్లి గ్రామం, H/O కొండకమర్ల, ఓ.డి.సి. మండలం, శ్రీసత్యసాయి జిల్లా. ...1వ ప్రతివాది
2.బోయ ముతక లక్ష్మీపతి S/o లేట్ బి.వెంకట్రామన్న, R/o D.No. 8-38, శేషయ్యగారిపల్లి గ్రామం, H/O కొండకమర్ల, ఓ.డి.సి. మండలం, శ్రీసత్యసాయి జిల్లా. ...2వ ప్రతివాది
పై దావాలో ప్రతివాదులైన D1 మరియు D2కు దావా సమను
పై దావాలో పైన తెల్పిన కోర్టువారు మీ యొక్క హాజరు నిమిత్తము వాయిదా:21-03-2023వ తేదిన ఉ॥10.30 గం॥లకు మీరు స్వయముగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై కోర్టువారి ఎదుట హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకోగలరు. అట్లు హాజరుకాని యెడల పై దావాను మీ యొక్క పరోక్షమున తీర్మాణము చేయుదురని ఇందులమూముగా తెలియజేయడమైనది.
(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)
స్థలం:కదిరి
వాయిదా తేది:21-03-2023.
ఎ.క్రిష్ణమూర్తి, ఎం.ఏ., ఎల్.ఎల్.బి.
వాదితరపు వకీలు, కదిరి, శ్రీసత్యసాయి జిల్లా
సెల్:9440310692.

మహారాజశ్రీ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి:కదిరి
దావా నెం.658/2021
Between:
తాళ్ళపల్లి మల్లేశ్వరి W/o టి.రామక్రిష్ణయ్య, D/o లేటు బాలినేని గంగన్న R/o బొల్లగొండిచెర్వు, H/O గిడింగివారిపల్లి, వేముల మండలం, వైయస్సార్ కడప జిల్లా. ప్రస్తుత చిరునామా:డోర్‌నెం.85-369, సరోజినీనగర్, ఎపిఎస్ఆర్‌టిసి వర్క్‌షాప్ (పోస్టు), పుట్లంపల్లి, వైయస్సార్ కడప కార్పొరేషన్ మరియు జిల్లా. ...వాది
మరియు
1.బాలినేని వెంకట లక్ష్మమ్మ W/o లేటు బాలినేని గంగన్న, ఓడులపల్లి (వి), H/O ఓడులపల్లి, తలుపుల (మం.) శ్రీ సత్యసాయిజిల్లా ప్రస్తుత చిరునామా: డోర్‌నెం.4-20, సైదాపురం (వి), తొండూరు (మం॥), వైయస్సార్ కడపజిల్లా.
2.గజ్జు శాంత కుమారి W/o జి.రవిశంకర్ D/o లేట్ బాలినేని గంగన్న, R/o డోర్‌నెం. 4-20, సైదాపురం (వి), తొండూరు (మం॥), వైయస్సార్ కడపజిల్లా.
...ప్రతివాదులు 1 మరియు 2
పై దావాలో ప్రతివాదులైన 1 మరియు 2వ వారికి దావా సమను
పై దావాలో పైన తెల్పిన కోర్టువారు మీ యొక్క హాజరు నిమిత్తము వాయిదా:15-03-2023వ తేదిన ఉ॥10.30 గం॥లకు మీరు స్వయముగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై కోర్టువారి ఎదుట హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకోగలరు. అట్లు హాజరుకాని యెడల పై దావాను మీ యొక్క పరోక్షమున తీర్మాణము చేయుదురని ఇందుమూలముగా తెలియజేయడమైనది.
(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)
స్థలం:కదిరి
వాయిదా తేది:15-03-2023.
ఎ.క్రిష్ణమూర్తి, ఎం.ఏ., ఎల్.ఎల్.బి.
వాదిపరం న్యాయవాది, కదిరి, శ్రీసత్యసాయి జిల్లా,
సెల్:9440310692.

మహారాజశ్రీ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి:కదిరి
దావా నెం.4/2022
Between:
కె.ఇంద్రావతమ్మ W/o కె.కొండారెడ్డి, R/o డోర్‌నెం.8/16, కె.గొల్లపల్లి (వి), H/O కటారుపల్లి, గాండ్లపెంట (మం.), శ్రీసత్యసాయి జిల్లా. ...వాది
మరియు
తుంగ వేమనారాయణరెడ్డి S/o టి.కేశవరెడ్డి, R/o డోర్‌నెం.5-86, కటారుపల్లి (వి &పోస్టు), గాండ్లపెంట (మం.), శ్రీసత్యసాయి జిల్లా. ...ప్రతివాది
పై దావాలో ప్రతివాదికి దావా సమను
పై దావాలో పైన తెల్పిన కోర్టువారు మీ యొక్క హాజరు నిమిత్తము వాయిదా:31-03-2023 తేదిన ఉ॥10.30 గం॥లకు మీరు స్వయముగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై కోర్టువారి ఎదుట హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకోగలరు. అట్లు హాజరుకాని యెడల పై దావాను మీ యొక్క పరోక్షమున తీర్మాణము చేయుదురని ఇందుమూలముగా తెలియజేయడమైనది.
(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)
స్థలం:కదిరి
వాయిదా తేది:31-03-2023.
ఎ.క్రిష్ణమూర్తి, ఎం.ఏ., ఎల్.ఎల్.బి.
వాదిపరం న్యాయవాది, కదిరి, శ్రీసత్యసాయి జిల్లా,
సెల్:9440310692.

కెజిబివిలో భోజనం నాణ్యతపై ఎంపిపి ఆగ్రహం

ప్రజాశక్తి - బత్తలపల్లి

స్థానిక కెజిబివిలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించకపోవటాన్ని గమనించిన ఎంపిపి వెంగళరెడ్డి ఎస్ఒపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని సంజీవపురం గ్రామ వద్దనున్న కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని వైసిపి జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, రైతు విభాగం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కమతం ఈశ్వరయ్యతో కలిసి ఎంపీపీ గజ్జెల వెంగళరెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యాలయంలో నాసిరకంగా ఉన్న కూరగాయలను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. వీటిని విద్యార్థులకు ఎలా పెడుతున్నారని నిలదీశారు. ఆరటి పండ్లు పచ్చిగా ఉన్నాయని, చాలా చిన్నవిగా ఉన్నాయని అన్నారు.కోడిగుడ్లు సైతం పగిలిపోయి ఉన్నాయని వీటిని ఎలా తీసుకున్నారని ప్రశ్నించారు. అనంతరం అనంతపురం నుంచి వీటిని సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్ జితేంద్రకు ఫోన్ చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై నాసిరకం సరుకులు పంపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎన్నికల విధులపై మాస్టర్ ట్రైనర్లతో శిక్షణ

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

ఎన్నికల విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు మాస్టర్ ట్రైనర్స్ ద్వారా శిక్షణ నిర్వహించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ పక్రియకు సంబంధించి చేపట్టవలసిన విధివిధానాలపై భాస్కర్ ట్రైనర్స్ చిన్నయ్య తదితరులు శిక్షణ తరగతులు నిర్వహించారు. బ్యాలెట్ పేపరు వినియోగం, పిఒ డైరీ ప్రాధాన్యత, ఎన్నికల నియమావళి అమలు, ఓటింగ్ విధానం, నూతన ఓటర్ల జాబితా, పేపరు సీలు పరిశీలన తదితర ముఖ్య అంశాలపై అవగాహన కల్పించారు. ఓటింగ్ ప్రారంభం ముందు ఆ తరువాత ప్రిసైడింగ్ అధికారులు చేపట్టే విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. బ్యాలెట్ బాక్సుల పనితీరు, ఏజెంట్లు, మండల టీం లతో సమన్వయం తదితర అంశాలపై దృష్టి సారించాలన్నారు. బ్యాలెట్ పేపర్లు, కౌంటింగ్ ఫైల్ లో తేడాను గమనించి సరిచూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం డిప్యూటీ తహశీల్దార్లు మైనుద్దీన్, నరసింహులు, ప్రిసైడింగ్ అధికారులు సహా అధికారులు పాల్గొన్నారు.


లోకేష్‌తో కలసి పాదయాత్రలో పాల్గొన్న 'పల్లె' తదితరులు

యువగళం పాదయాత్రకు మాజీ మంత్రి సంఘీభావం

కొత్తచెరువు : చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గంలో పులిచెర్ల మండలం కొత్తపేటలో నారా లోకేష్ శుక్రవారం నిర్వహించిన యువగళం పాదయాత్రకు మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తన సంఘీభావం తెలిపారు. పుట్టపర్తి నియోజకవర్గంలోని తన మద్దతుదారులతో కలసి వెళ్లి సంఘీభావం తెలిపారు. ఉదయం నుండి సాయంకాలం వరకు ఆయన వెంట పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాసులు, మండల కన్వీనర్ రామకృష్ణ, టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, పుట్టపర్తి కన్వీనర్ రామాంజనేయులు, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ ధరల పెంపుపై వెల్లువెత్తిన ప్రజాగ్రహం


పెనుకొండలో వినూత్న నిరసన తెలుపుతున్న నాయకులు

పెనుకొండ : పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలన్న డిమాండ్‌తో సిపిఎం నాయకులు శుక్రవారం వినూత్న నిరసన తెలిపారు. పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సిలిండర్లు పక్కనపెట్టి కట్టెలు పొయ్యి పెట్టుకొని ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ అధికారంలోకి రాకముందు అనేక హామీలిచ్చిన మోడీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలపై మోయలేని భారాలు మోపుతున్నారని విమర్శించారు. పెట్టుబడిదారులు, కార్పొరేట్ కంపెనీలకు రాయితీలు ఇస్తూ సామాన్య, పేద ప్రజలను ఆర్థిక ఇబ్బందులు గురి చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు తిప్పన్న ,బాబావలి, మహబూబ్ బాషా, మూర్తి , సిఐటియు నాయకులు వజ్రం నాగప్ప, రెడ్డప్పరెడ్డి, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : గ్యాస్ ధరల పెంపుపై మహిళలు నిరసన వ్యక్తం చేశారు. శుక్ర వారం కదిరి పట్టణంలోని శివాలయం వీధిలో ఐద్వా, సిఐటియు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ ములిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా రోజురోజుకు పెరుగుతున్న నిత్యవసర ధరలతో ఇబ్బందులు పడుతుంటే గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ పై 50 రూపాయలు పెంచడం దుర్మార్గమన్నారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్యాస్ ధరలను పెంచడం అలవాటుగా మార్చుకుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు శాంతిబాయి, హేమలత, బాబులమ్మ, అమరావతి, రమాదేవి, సిఐటియు నాయకులు జగన్మోహన్, రామ్మోహన్, కష్ణానాయక్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై అవగాహన

గోరంట్ల: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో రాజకీయ పార్టీ నాయకులకు ఎమ్మెల్సీ ఎన్నికలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రంగనాయకులు, ఎంపీడీవో రఘునాథ్ గుప్తా, ఇఒఆర్‌డి సతీష్ కుమార్‌తో పాటు వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : ఈనెల 13న పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నట్టు తహశీల్దార్ రామాంజనేయరెడ్డి తెలిపారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మూడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మండలంలో పట్టభద్రుల ఓటర్లు 1715 మంది, ఉపాధ్యాయుల ఓట్లు 120 ఉన్నాయన్నారు.

అమరాపురం : ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై సచివాలయ సిబ్బందికి, వీఆర్వోలకు ఎన్నికల ఏరియా నోడల్ అధికారి సురేష్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కల్పించారు. మండల కేంద్రంలోని తెలుగు సమాఖ్య కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మానవ హక్కుల పరిరక్షణ సంస్థ కార్యాలయం ప్రారంభం

పుట్టపర్తి రూరల్: హ్యూమన్ రైట్స్ కన్సర్వేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మానవ హక్కుల పరిరక్షణ సంస్థ నూతన జిల్లా కార్యాలయాన్ని పుట్టపర్తి ఆర్‌డిఒ ఆఫీస్ పక్కన శుక్రవారం ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి హెచ్ఆర్ సిసిఐ వ్యవస్థాపకులు సింగమాల వెంకటరమణయ్య, పుట్టపర్తి ఆర్డీవో భాగ్యరేఖ హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మానవహక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర డైరెక్టర్లు శ్యామ్, రాజారావు, నారాయణస్వామి, శ్రీసత్యసాయి జిల్లా చైర్మన్ చెరుకూరి గంగులయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కు విధానంపై అవగాహన

ధర్మవరం టౌన్ : స్థానిక ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం అన్ని రాజకీయ పార్టీనాయకులతో ఏర్పాటు చేసిన ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్డీవో మాట్లాడుతూ ఉపాధ్యాయ, పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, తహశీల్దార్ నాగేంద్ర, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.


పింఛను సొమ్ము అందజేస్తున్న వైస్ చైర్మన్ సాయికుమార్

కిడ్నీవ్యాధిగ్రస్తుడికి పింఛను అందజేత

ధర్మవరం టౌన్ : మండల పరిధిలోని చిన్నూరు గ్రామ నివాసి ఆదినారాయణ కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈయనకు కిడ్నీ వ్యాధి గ్రస్తులకు పంపిణీ చేసే పింఛను మంజూరు కావటంతో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మాసపల్లి సాయికుమార్ చేతుల మీదుగా పంపిణీ చేశారు.

ఇస్తిమా ప్రాంతాన్ని పరిశీలించిన ఎస్పీ

కదిరి టౌన్ : కదిరి పట్టణంలో ప్రారంభమైన ఇస్తిమా ప్రాంతాన్ని జిల్లా ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ శుక్రవారం పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు . ఈ కార్యక్రమంలో కదిరి డీఎస్పీ భవ్యకిషోర్, రూరల్ సిఐ సిబ్బంది పాల్గొన్నారు

ఇద్దరు హోంగార్డులకు ప్రశంసాపత్రాలు

రొద్దం : సత్య సాయి జిల్లా కేంద్రంలో శుక్రవారం జరిగిన హోంగార్డు డిమోబ్లిజేషన్ పెరేడ్‌లో రొద్దం మండలంలోని ఇద్దరు హోంగార్డులు ప్రంశంసాపత్రాలు అందుకున్నారు. ఎస్పీ చేతుల మీదుగా రొద్దంకు చెందిన హోంగార్డులు శివకుమార్, ఆనంద్ ప్రశంసాపత్రాలు అందుకున్నారు.

ఇస్తిమాలో పాల్గొన్న ఎమ్మెల్యే

కదిరి అర్బన్ : మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లిలో నిర్వహిస్తున్న ఇస్తిమా కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పివి. సిద్ధారెడ్డి పాల్గొన్నారు. శుక్రవారం నిర్వహించే జుమ్మా నమాజ్‌లో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఇస్తిమాలో పాల్గొన్న ముస్లిం సోదరులకు భోజనం టోకెన్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ ఛైర్మన్లు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

చెరువులో మట్టి తరలింపును ఆపాలి

గోరంట్ల: మండలంలోని దేవుళ్లచెరువు గ్రామానికి చెందిన చెరువులో ప్రైవేటు వ్యక్తులు అక్రమంగా జెసిబి వాహనం సాయంతో ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తున్నారని ఈ చర్యలను ఆపాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పెద్దన్న, సిఐటియు జిల్లా నాయకులు రమేష్ ఆధ్వర్యంలో తహశీల్దార్ రంగనాయకులకు తమ డిమాండ్లతో కూడన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ చెరువులోని మట్టిని తరలిస్తున్న వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్పందించిన తహశీల్దార్ వెంటనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

షాదీఖానాలో ప్రత్యేక ప్రార్థనలు

కొత్తచెరువు : స్థానిక పోలీస్ స్టేషన్ వెనుక ఉన్న షాదీఖానాకు నూతన పాలక మండలి ఏర్పాటు చేసిన నేపథ్యంలో చైర్మన్ జాకీర్ ఆధ్వర్యంలో మూతవల్లీలు, ముస్లిం సోదరులు శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. 20 సంవత్సరాల కిందట నిర్మించిన షాదీఖానా ఇప్పటివరకు ప్రారంభానికి నోచుకోలేదు వాటి మరమ్మతులకు వక్స్ బోర్డ్ నుండి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో అక్కడ ప్రార్థనలు నిర్వహించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముతవల్లిలు అతావుల్ రెహమాన్, అజీజ్ రహిమాన్, మైనార్టీ నాయకులు అయూబ్, మొహమ్మద్, షాజహాన్, రఫీ, చందు, తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

మడకశిర రూరల్ : మండలంలోని కల్లుమర్రి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎస్‌వి కృష్ణారెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రజలు సీజనల్ వ్యాధులకు గురి కాకుండా వైద్య ఆరోగ్య సిబ్బంది గ్రామాలలో పర్యటించాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ పి ఎస్ మంజువాణి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ వినోద్ కుమార్, మడకశిర డివిజన్ మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ బి కోదండరామిరెడ్డి, పుట్టపర్తి జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి లక్ష్మా నాయక్, ఎంపిహెచ్ఒ రమేష్, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

పిడిఎఫ్ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం

హిందూపురం : పశ్చిమ రాయలసీమ పరిధిలో శాసనమండలికి పిడిఎఫ్ తరుపున పోటీ చేస్తున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు, టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటుతో అత్యధిక మెజారిటీతో గెలిపించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి నరసింహప్ప, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి కోరారు. ఈ మేరకు శుక్రవారం హిందూపురం పట్టణంలో సిపిఎం ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, సచివాలయాల్లో, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వివిధ పాఠశాల, కళాశాలల్లో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపు కోరుతూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ అధ్యక్షులు జగదీష్, ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

తనకల్లు : రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గానికి పిడిఎఫ్ తరపున ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పోతుల నాగరాజుకు మద్దతుగా ఎపి రైతుసంఘం నాయకులు మండల కేంద్రంలో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఎపి రైతు సంఘం నాయకులు బడా సుబ్బిరెడ్డి తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు. ప్రజా సమస్యలను చట్టసభలో వినిపించే నాయకుడిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివన్న, నరసింహారెడ్డి, వివి. రమణ, కెవి. రమణ, తదితరులు పాల్గొన్నారు.



హిందూపురం, తనకల్లులో ఓటు అభ్యర్థిస్తున్న నాయకులు

సెమిస్టర్ విద్యార్థులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి-హిందూపురం

ఎస్కేయు నిర్వహించిన డిగ్రీ నాల్గవ సెమిస్టర్ ఫలితాల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు న్యాయం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని కళాశాల వసతిగృహం వద్ద విలేకరులతో మాట్లాడారు. మంగళవారం ఎస్కేయు డిగ్రీ నాల్గవ సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదల చేసిందని అందులో కేవలం 31శాతం మంది విద్యార్థులు మాత్రమే ఉత్తీర్ణత సాధించారని అన్నారు. ఎస్కేయు పరీక్షల విభాగం నిర్లక్ష్యం కారణంగా 69 శాతం మంది విద్యార్థిని, విద్యార్థులు డిగ్రీ నాల్గవ సెమిస్టర్‌లో ఫెయిల్ అయ్యారని విమర్శించారు. ఫెయిల్ అయిన విద్యార్థుల పేపర్లను రీవాల్యుయేషన్ ఉచితంగా చేయాలని కోరారు. పేపర్ కరెక్షన్‌లో కొంతమంది లెక్చరర్స్ నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లనే పరీక్ష బాగా రాసిన విద్యార్థులు సైతం ఫెయిల్ అవుతున్నారని విమర్శించారు. ఇలా కావటం ఇది మొదటి సారి కాదని అన్నారు. విద్యార్థుల జీవితాలతో ఆటలాడుతున్న అలాంటి లెక్చరర్స్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో చలో ఎస్‌కె కార్యక్రమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు హర్షకుమార్, భగత్, అభి, మహేష్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలను నివారించాలని వినతి

కనగాన పల్లి : వ్యవసాయరంగానికి సరఫరా అయ్యే విద్యుత్‌ను సక్రమంగా అందించాలని రైతులు కోరారు. ఈ మేరకు వారు తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ట్రాన్స్‌కో ఎఇకి అందజేవారు. ఈసందర్భంగా రైతులు, సిపిఐ నాయకులు మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈకార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

ఒంటరి మహిళలకు ఆర్డీటీ చేయూత

బత్తలపల్లి : ఒంటరి మహిళలు ఇతరుల మీద ఆధారపడకుండా స్వతంత్రంగా, గౌరవంగా జీవించాలన్నదే ఆర్డీటీ ధ్యేయమని ఉమెన్ ఎన్ఫోర్మెంట్ సెక్టార్ డైరెక్టర్ విశాల ఫెర్రర్ అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్డీటీ ఫీల్డ్ కార్యాలయంలో ఒంటరి మహిళలకు చేయూతనందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్డీటీ అన్ని రంగాల్లోని పేదలకు అండగా నిలుస్తోందన్నారు. ఒంటరి మహిళలకు అండగా నిలబడిందన్నారు. అనంతరం ఒంటరి మహిళలకు కుట్టుమిషన్లు, మూడు జిగ్ జాగ్ మిషన్లు, ఒక ఫ్లోర్ మిషన్, ఒక గ్రైండర్. ఒక జిరాక్స్ మిషన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏడీ హేమలత, స్పానిష్ మహిళ, ఆర్డీ ప్రమీల, ఎస్టీఎల్ వనజ, కావేరి, ఏడీ ప్రకాష్ రెడ్డి, రీజనల్ ఎటిఎల్‌లు, సిఒలు తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలను అడ్డుకోవాలి

బత్తలపల్లి : బాల్య వివాహాలు చేస్తుంటే అడ్డుకోవాలని, లేదంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని వైద్యాధికారిణి నిఖిత కోరారు. శుక్రవారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా బేటి బడావో బేటి పడావో కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ రాజశేఖర్, సూపర్‌వైజర్ నారమ్మ, పాఠశాల హెచ్‌ఎం పద్మ తదితరులు పాల్గొన్నారు.